అవస్థ పడుతున్నాం.. 'ఆసరా' ఇవ్వండి సారూ

కలెక్టరేట్ వద్ద భోజనం చేస్తున్న వృద్ధ దంపతులు పూర్యానాయక్, లక్ష్మి

మాకు 75 ఏండ్ల వయసు. నడవనీకే శాతనైతలేదు.. ఉన్న కొడుకు బతుకుదెరువు కోసం రాష్ట్రం విడిచిపోయిండు. ఉన్న ఊరిని విడిచి పోలేక మేము మా తండాలోనే నివాసముంటున్నం. కొడుకు పంపించే కొద్దిపాటి డబ్బులు ఆరోగ్యం బాగా లేక దవాఖాన ఖర్చులు, తిండికి కూడా సరిపోవడం లేదు. మా వయస్సున్నోళ్లకు మా తండాలో గవర్న మెంటోళ్లు ఇచ్చే పింఛన్ వస్తున్నది. మాకు మాత్రం 75 ఏండ్లు ఉన్నా కూడా నాకు, నా భర్తకు పింఛన్ ఇస్తలేరు. ఎన్ని సార్లు సారోళ్ల చుట్టు తిరిగినా కనికరిస్త లేరు. ఇప్పటికైనా పెద్ద సారోళ్లు మా పరిస్థితిని చూసి పింఛన్ ఇప్పిస్తే 'ఆసరా'గా ఉంటుందని శుక్రవారం బాలానగర్ మండలం మేడిగడ్డతండాకు చెందిన వృద్ధులు పూర్యానాయక్, లక్ష్మి దంపతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ వద్దే తమ వెంట తెచ్చుకున్న భోజనాన్ని తిని గ్రామానికి వెళ్లిపోయారు.

-మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 16

వ్యవసాయరంగానికి ప్రోత్సాహం

- మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్

ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్

పాలమూరు, ఫిబ్రవరి 16 : జీవమను గడతో వ్యవసాయం ఆధారపడి ఉన్నదని, ఇలాంటి రంగాన్ని కాపాడుకొని మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరముందని మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్ తెలిపారు.

శుక్రవారం జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ), నాబార్డ్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యవసాయ రంగాల ఉత్పత్తులు తదితర అనుబంధ అంశాలపై ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సాగు, వ్యవసాయం, నీటి వినియోగం, పాడి పరిశ్రమ, గ్రామీణ సంఘాలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను చేపట్టాలి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 16 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన సీసీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ రవినాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పంచాయతీరాజ్ డీఈ, ఏఈలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24 సంపత్సరంలో రూ.17కోట్ల 80లక్షల 50వేల అంచనాలతో 397 సీసీ రోడ్లు మంజూరు కాగా, 140 సీసీ రోడ్డు పనులు చేపట్టారన్నారు. మిగతా పనులు వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం టీఎస్-ఐపాస్ కింద పరిశ్రమల కోసం ఏర్పాటు చేసుకున్న ధరఖాస్తుదారులకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు.

మెడికల్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేయాలి

- నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష
- నిర్మాణ పనుల పరిశీలన

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 16 : మెడికల్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీహర్ష అధికారులకు సూచించారు. మండలంలోని అప్పంపల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులు ఇతర ఏర్పాట్లను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ తదితరులుపాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనపై అవగాహన

నారాయణపేట, ఫిబ్రవరి 16 : ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్రీహర్ష అధికారులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ హైదరాబాద్, జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన కల్పించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మిట్టాల్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, బీసీ సంక్షేమశాఖ అధికారి కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

భరోసా కేంద్రంతో బాసట: ఎస్పీ యోగేశ్‌గౌతమ్

నారాయణపేట, ఫిబ్రవరి 16 : భరోసా కేంద్రం మహిళలకు బాసటగా నిలుస్తుందని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని గాయత్రినగర్‌లో నూతన భరోసా కేంద్రాన్ని మహిళా ఎస్సై వసంత ప్రారంభింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉమెన్ సెఫ్టీవింగ్ పర్యవేక్షణలో భరోసా సపోర్ట్ సెంటర్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ కోసం ఈ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా పరిధిలో హింసకు గురైన మహిళలకు, ప్రైవేట్, పబ్లిక్ ప్రదేశాల్లో, కుటుంబం, సంఘం, కార్యాలయంలో మద్దత్తు ఇవ్వడానికి ఉపయోగపడుతుందన్నారు. ఆపదలో ఉన్న, లైంగిక దాడికి గురైన మహిళలు, చిన్నారులకు రక్షణ, వైద్య, న్యాయ సహాయం అందించి నిందితులకు కోర్టులో శిక్ష పడేలా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. భరోసా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు, సీఐ రాంలాల్, ఆర్ఐ శేఖర్‌బాబు, ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పటిష్టంగా చేపట్టాలి

భూత్పూర్, ఫిబ్రవరి 16: గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పటిష్టంగా చేపట్టాలని జెడ్పీ సీఈవో రాఘవేందర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు, నర్సరీల నిర్వహణ, సీసీ రోడ్ల నిర్మాణాలు తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఫార్మేషన్ రోడ్లు వేసేటప్పుడు రైతులు, గ్రామస్తులతో మాట్లాడి గ్రామ పంచాయతీల్లో తీర్మానాలను తీసుకోవాలని సూచించారు. ముందుగా మొదటి సారి కార్యాలయానికి వచ్చిన జెడ్పీ సీఈవోను ఎంపీడీవో ప్రభాకర్, కార్యాలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో డీఎస్‌వీ శర్మ, వైస్ ఎంపీపీ నరేశ్‌గౌడ్, ఎంపీవో శ్రీదేవి, ఏఈ స్వామి, సీనియర్ అసిస్టెంట్ అతిఖుర్ రహమాన్, ఏపీవో విమల, ఈవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
MOGULANNA S/o DHARMANNA, House No. 4-33-1, Garlapadu Villege, Dharoor Mandal, Jogulamba Gadwal Dist, I have changed my name as MADAN

WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319440-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న కైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

ప్రజా వ్యతిరేక విధానాలను వీడాలి

- కార్మిక సంఘాల ధర్నా
- అంగన్‌వాడీ టీచర్లు, ఆశాల నిరసన ర్యాలీలు

మహబూబ్‌నగర్‌లో ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 16 : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆశా కార్యకర్తల తోపాటు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ, బీఆర్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఎస్‌కేఎం తదితర సంఘాల ఆధ్వర్యంలో గ్రామీణ బంద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు, లేబర్ కోడ్లు, విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు గిరిజ, మల్లమ్మ, ఉపాధ్యక్షురాలు రాణి, రజిత, జిల్లా కోశాధికారి అన్నపూర్ణ, చంద్రకళ తదతరులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

ఉద్యోగుల చిరకాల స్వప్నమైన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలను ధరించి శుక్రవారం ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదాయ పన్ను పరిమితిని రూ.10లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యగులను వెంటనే క్రమబద్ధీకరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రానాయక్,రాజేందర్‌రెడ్డి, శేఖర్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్లలో..

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి 16 : జడ్చర్లలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య, రాష్ట్ర నాయకుడు కిల్లెగోపాల్ పాల్గొని మాట్లాడారు. కేంద్రం పేదలు, కార్మికుల కడుపుకొట్టి కార్పొరేట్, బడా వ్యాపారులకు వత్తాసు పలుకుతుందన్నారు.

దేవరకద్రలో..

దేవరకద్ర రూరల్ (చిన్న చింతకుంట), ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు కార్మిక చట్టాలను రద్దుచేయాలని తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. భారత్‌బంద్‌లో భాగంగా శుక్రవారం చిన్న చింతకుంట మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికులు, రైతులకు మేలు చేసే విధంగా చట్టాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, బాబు, నర్సింహ, భిక్షపతి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో..

బాలానగర్, ఫిబ్రవరి 16 : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం మండల కేంద్రంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామీణ భారత్‌బంద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

హన్వాడలో..

హన్వాడ, ఫిబ్రవరి 16 : రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని శుక్రవారం మండల కేంద్రంలోని తాండూరు-మహబూబ్‌నగర్ ప్రధాన రోడ్డుపై సీపీఎం నాయకులు, కార్మికులు రాస్తారోకో చేపట్టారు.

మిడ్జిల్‌లో..

మిడ్జిల్, ఫిబ్రవరి 16 : మరోసారి మోదీ అధికారంలోకి వస్తే దేశాన్ని అమ్మకానికి పెడుతారని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు రాము లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గ్రామీణ బంద్‌లో భాగంగా కార్మికులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు.

ఊట్కూర్‌లో..

ఊట్కూర్, ఫిబ్రవరి 16 : కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సలీం, సీఐటీయూ మండల అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం మండలకేంద్రంలో అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, రైతు సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించి తాసీల్దార్ మమతకు వినతి పత్రం అందజేశారు. బిజ్వారంలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు.

మరికల్‌లో..

మరికల్, ఫిబ్రవరి 16 : అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.

ధన్వాడలో..

ధన్వాడ, ఫిబ్రవరి 16 : కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ ఆధ్వర్యంలో కార్మికులు, రైతులు రాస్తారోకో నిర్వహించారు.

మాగనూరులో..

మాగనూరు, ఫిబ్రవరి 16 : మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు గ్రామీణ బంద్ నిర్వహించారు. పురవీధుల గుండా ర్యా లీ నిర్వహించి అంతరాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేపట్టారు.

కృష్ణలో..

కృష్ణ, ఫిబ్రవరి 16 : మండలంలోని కాన్ దొడ్డిలో శుక్రవారం పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ ఆధ్వర్యంలో ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

జడ్చర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఊట్కూరులో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ధన్వాడలో రాస్తారోకోతో నిలిచిన వాహనాలు

ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం

- వంశీచంద్‌రెడ్డి

బాలానగర్, ఫిబ్రవరి 16 : కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి అన్నారు. పాలమూరు న్యాయ యాత్రలో భాగంగా శుక్రవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి మండల కేంద్రంతోపాటు గుండేడ్‌లో పర్యటించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్నల్ మీటింగ్ మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. శనివారం జడ్చర్లలో నిర్వహించే యాత్రకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వస్తున్నారన్నారు.

మైసమ్మ ఆలయంలో పూజలు..

నవాబ్‌పేట, ఫిబ్రవరి 16 : సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయయాత్ర శుక్రవారం నవాబ్‌పేట మండలానికి చేరుకున్నది. స్థానిక నేతలతో కలిసి ఫత్తేపూర్ మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాకర్లపహాడ్, రుద్రారం, నవాబ్‌పేట గ్రామాల్లో నిర్వహించిన మీటింగ్‌లో ఆయన మాట్లాడారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

మరికల్, ఫిబ్రవరి 16 : గ్రామాల్లో ప్రజలకు సమస్యలు రాకుండా పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ శ్రీకళ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు గోపాల్ మట్లాడుతూ ప్రభుత్వ దవాఖాన వద్ద నీసీ రోడ్డు వేయగా, పక్కల మట్టి వేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సబ్ సెంటర్ నిర్మాణ పనులు ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు సమస్యలపై శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రవికుమార్, తీలేరు సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్‌గౌడ్, నూతన ఎంపీడీవో జ్యోతితోపాటు ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 16 : కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన జీకే మాస్టర్ షోటోకాన్ బ్లాక్‌బెల్ట్ కరాటే విద్యార్థి అఖిలేశ్వర్‌రెడ్డిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో సన్మానించారు. కార్యక్రమంలో మాస్టర్ శివకుమార్, అలీ ముద్దీన్, పవన్, కల్యాణ్, రిశ్విత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మూసాపేట, ఫిబ్రవరి 16 : మండల కేంద్రానికి చెందిన మొఖ్తదీర్ పక్షవాతంతో చికిత్స పొందుతున్నాడు. విషయాన్ని స్థానిక నాయకుడు ఎన్ .తిరుపత య్యగౌడ్ ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం నగదులను తిరుపతయ్య గౌడ్ మొఖ్తదీర్‌కు అందజేశారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ వనజాగౌడ్

సమావేశంలో మాట్లాడుతున్నజెడ్పీ చైర్ పర్సన్‌వన జాగౌడ్, చిత్రంలో కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 16 : సంక్షేమ పథకాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ వనజాగౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జెడ్పీటీసీలు, ఎంపీపీలు తమ పరిధిలోని సమస్యలు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. రైతుబంధు సాయం ఎన్ని ఎకరాల వరకు వేసే అవకాశముందని జెడ్పీకో ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్ ప్రశ్నించారు. ప్రభుత్వం రైతు భరోసా పథకానికి నిర్దిష్టమైన ప్రణాళికను ప్రభుత్వం రూపొందిస్తున్నదని, ప్రస్తుతం గతంలో మాదిరిగానే డబ్బులు జమచేస్తున్నట్లు డీఏవో జాన్‌సుధాకర్ సమాధానమిచ్చారు. గుండెపోటు మరణాలపై వైద్యాధికారులు అవగాహన కల్పించాలని జెడ్పీటీసీ సునీత అధికారులకు సూచించారు. ఊట్కూర్, మక్తల్, మాగనూరు మండలాల్లో తాగునీటి సమస్య ఉందని, మరింత జఠిలం కాకముందే తగిన చర్యలు తీసుకోవాలని పలువురు ఎంపీపీలు సభ దృష్టికి తెచ్చారు. అనంతరం కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి మిషన్ భగీరథ సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో శైలజ, డిప్యూటీ సీఈవో జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం

దేవరకద్రలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



రాచాలలో చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దేవరకద్ర, ఫిబ్రవరి 16: మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి వార్షిక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణలతో లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవం తిలకించేందుకు భక్తు లు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఆర్చకులు, పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

రాచాలలో..

మూసాపేట(అడ్డాకుల), ఫిబ్రవరి 16 : మండలంలోని రాచాల గ్రామంలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యా ణం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు , గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి

మరికల్‌లో సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

పాలమూరు, ఫిబ్రవరి 16 : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం రథసప్తమి వేడుకలు కళాశాల సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సూర్య నమస్కారాలు చేయడం వల్ల ఆయురారోగ్యాలతో జీవిస్తారని తెలిపారు. అంతకుముందు రంగులతో రథం ముగ్గు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గంగాధర్, అమీనా ముంతాజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం..

మహభూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరకాలనీ గెలాక్సీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రథసప్తమి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా, సూర్యనమస్కారాలు చేయించారు. టీటీడీ నిర్వాహకులు ఉత్తరాపల్లి రామాచార్యులు రథసప్తమి విశిష్టతకు విద్యార్థులకు వివరించారు.

మరికల్ మండలంలో..

మరికల్, ఫిబ్రవరి 16 : మండలంలోని పలు పాఠశాలలు, ఆలయాల్లో రథసప్తమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సూర్య నమస్కారాలు చేశారు.

దామరగిద్ద మండలంలో..

దామరగిద్ద, ఫిబ్రవరి 16 : రథసప్తమిని పురస్కరించుకుని శివమాలధారణ దీక్షలో భాగంగా మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. 50మంది భక్తులు మాలధారణ తీసుకున్నారు. అనంతరం భక్తులకు వెంకట్‌రెడ్డి, పద్మమ్మ, మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

రాజాపూర్‌లో..

రాజాపూర్, ఫిబ్రవరి 16 : రథసప్తమిని వేడుకలను మండల కేంద్రతోపాటు గ్రామాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మహాద్వార్‌లో వైభవంగా రథోత్సవం

మక్తల్, ఫిబ్రవరి 16 : మండలంలోని మహాద్వార్‌లో వెలిసిన గట్టు తిమ్మప్ప (వేంకటేశ్వర) స్వామి రథోత్సవం శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేక అలంకరణలో పల్లకీలో ఊరేగింపుగా కొండపై నుంచి తీసుకొచ్చి కల్యాణమండపంలో కల్యాణం నిర్వహించారు. కర్నిలో గుంటి రంగస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రథోత్సవాన్ని వైభవంగా చేపట్టారు.

తిమ్మప్పస్వామి పల్లకీసేవ

నారాయణపేట రూరల్, ఫిబ్రవరి 16 : భక్తుల కోలాహలం మధ్య ఎక్లాస్‌పూర్ తిమ్మప్పస్వామి పల్లకీసేవ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పేట పురవీధుల గుండా సాగిన ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ డీఎస్పీగా వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఫిబ్రవరి 16 : మహబూబ్‌నగర్ డీఎస్పీగా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జోగులాంబ గద్వాల జిల్లా నుంచి మహబూబ్‌నగర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పేట డీఎస్పీగా లింగయ్య

నారాయణపేట, ఫిబ్రవరి 16 : నారాయణపేట డీఎస్పీగా లింగయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లో సీఐడీ డీఎస్పీగా విధులు నిర్వర్తించిన లింగయ్య బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ డీఎస్పీగా విధు లు నిర్వర్తించిన సత్యనారాయణ జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన ఎస్పీ యోగేశ్ గౌతమ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మక్తల్ మున్సిపల్ కమిషనర్‌గా భోగేశ్వర్లు

మక్తల్ టౌన్, ఫిబ్రవరి 16 : మక్తల్ మున్సిపల్ కమిషనర్‌గా భోగేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన బలరాంనాయక్ కొడంగల్‌కు బదిలీ అయ్యారు.

ఆర్‌ఓగా మహ్మద్‌ఖాజా

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 16 : మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ రెవెన్యూ అధికారిగా మహ్మద్‌ఖాజా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నేరేడుచర్ల మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేసిన ఈయన మహబూబ్‌నగర్